హమాలీల మధ్య ఘర్షణ

- ముగ్గురు వ్యక్తులను పోలీసులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

పట్టణ కేంద్రంలోని సివిల్ సప్లై గోదాంలో పనిచేస్తున్న బీహార్‌కు చెందిన హమాలీలు ఆదివారం రాత్రి భోజనం చేసే సమయంలో మాటకు మాట పెరిగి అందులో ఒకరిని కూరగాయలు కోసే కత్తితో మరొకరు గాయపరిచారని పోలీసులు తెలిపారు. గోదాంలో పనిచేస్తున్న హమాలీల మధ్య ఘర్షణ జరిగిన విషయం పోలీసులు తెలుసుకొని గాయ పడ్డ అర్జెంట్ కుమార్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో కొండారెడ్డి స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘర్షణకు దిగిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
1
మంగళవారం 08 ఆగస్టు 2023

పోస్టాఫీస్‌లో జాతీయ జెండాల అమ్మకం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

నిజామాబాద్ పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు అజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా తపాల శాఖ ఆధ్వర్యంలో ప్రతి పోస్ట్ ఆఫీస్‌లో జెండాలను అమ్మనున్నట్టు కామారెడ్డి పోస్టల్ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ జెండా కావాల్సిన వారు పోస్టాఫీస్‌కి వెళ్లి లేదా, పోస్టుమాస్టర్ లేదా పోస్ట్ మ్యాన్‌కు రూ.25 చెల్లించాలని, లేదా సైట్ ద్వారా ఈనెల 12 వరకు ఆన్లైన్ బుకింగ్ చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఆన్లైన్‌లో బుకింగ్ చేసుకున్న వారికి పోస్ట్‌మాన్ ద్వారా జెండాను ఇంటికి డెలివరీ చేస్తామని ఆయన తెలిపారు. ఏదైనా సంస్థ లేదా విద్యాలయంలో, కార్యాలయాల్లో కూడా ఎక్కువ మొత్తంలో జెండాలు అవసరముంటే పోస్టాఫీస్‌లో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు అందరూ ఉపయోగించుకోవాలని కోరారు.

కాంగ్రెస్.. కృతజ్ఞత లేని పార్టీ

- పీవీ చేసిన సేవలను మరిచి.. మరిపించే ప్రయత్నం చేసింది
- దేశ ఆర్థిక వ్యవస్థను మార్చిన మహోన్నతుడు
- పీవీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత


పీవీ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

కాంగ్రెస్ కృతజ్ఞత లేని పార్టీ అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. దేశానికి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు చేసిన సేవలను మరచిపోవడమే కాకుండా మరిపించే ప్రయత్నం కాంగ్రెస్ పార్టీ చేసిందని ధ్వజమెత్తారు. అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో దేశ ఆర్థిక వ్యవస్థను సమూలంగా మార్చి గాడిలో పెట్టిన మహోన్నత వ్యక్తి పీవీ కొనియాడారు. సోమవారంచయ నిజామాబాద్ జిల్లాలోని బోర్గాం (పి)చౌరస్తా వద్ద బ్రాహ్మణ సమాజం ఏర్పాటు చేసిన పీవీ నరసింహారావు విగ్రహాన్ని పీవీ కుమార్తె, ఎమ్మెల్సీ వాణి దేవి, కుమారుడు ప్రభాకర్‌రావుతో కలిసి కల్వకుంట్ల కవిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చేసిన ఘనకార్యాల వల్ల దేశ ఆర్థిక పరిస్థితిలో మొత్తం కుదేలైన సందర్భంలో పీవీ నరసింహారావు ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టారని తెలిపారు. విపత్కరమైన పరిస్థితుల్లో ఉన్న బంగారం కుదవపెట్టి అన్నమోరామచంద్ర అనుకుంటున్న క్లిష్టసమయంలో ప్రధాని అయిన పీవీ కేవలం తన మేధో సంపత్తితో ఆలోచన చేసి ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారని వివరించారు.

ఆర్థికవేత్త అయిన మన్మోహన్‌సింగ్‌ను ఆర్థిక మంత్రిగా నియమించుకొని కొత్త ప్రయోగాలకు పూనుకున్నారని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న బహుళజాతి కంపెనీల నుంచి పెట్టుబడులు ఆకర్షించేందుకు ధైర్యంగా చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఆనాడు పీవీ తీసుకున్న చర్యల వల్ల ఈ రోజు లక్షలాది మంది బిడ్డలకు ఉద్యోగాలు వచ్చాయని, కోట్లాది కుటుంబాలు దారిద్ర్య రేఖ నుంచి పైకి ఎగబాకాయన్న విషయం భారత దేశంలో ఎప్పటికీ మర్చిపోదని స్పష్టం చేశారు. కానీ అటువంటి విషయాన్ని కూడా మరిచిపోయి మరిపించే ప్రయత్నం కాంగ్రెస్ చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ బిడ్డను గుర్తించకపోతే సీఎం కేసీఆర్ పట్టుదలతో శతజయంతి ఉత్సవాలను నిర్వహించారని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా శతజయంతి ఉత్సవాలు జరిగాయని, పీవీ ఆలోచనా విధానాన్ని ఒక ఉద్యమంలా ప్రతీ తెలంగాణ బిడ్డ గుండెకు తట్టేలా చాటిచెబుతామని, ప్రపంచానికి పీవీ స్ఫూర్తిని పంచుతామని అన్నారు. పీవీ నరసింహా రావు విగ్రహం ఏర్పాటుతో నిజామాబాద్‌కు కొత్త కళ వచ్చిందన్నారు. తెలంగాణ నుంచి ఎదిగి దేశానికి ఎంత సేవ చేశారో అందరికీ తెలుస్తుందని, నూతన ఉత్సాహం వస్తుందని చెప్పారు. పీవీ 14 భాషల్లో మాట్లాడడం అంటే మామూలు మేథో సంపత్తికాదని కొనియాడారు. అంత మేధో సంపత్తి ఉన్న సరే పట్వారిగా ఉన్నప్పుడు ఎలా ఉన్నారో దేశ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు అలానే ఉన్నాడన్నారు. కేంద్రంలో విద్యా శాఖ మంత్రిత్వ శాఖను మానవ వనరుల శాఖ మంత్రిత్వ శాఖగా మార్చి అత్యద్భుతమైన కొత్త పద్ధతులను ప్రవేశపెట్టారని తెలిపారు. పీవీకి 65 ఏళ్ల వయస్సు నిండిన తర్వాత దేశానికి కంప్యూటర్లు వస్తే తన కోసం, తాను పది మందికి పనికి రావడం కోసం కంప్యూటర్ వాడకాన్ని నేర్చుకున్నారని కొనియాడారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ఇలా ఎవ్వరిదీ చిన్న పదవి కాదని, సమాజంలో అందరికీ పాత్ర ఉంటుందని స్పష్టం చేశారు. నిబద్ధతతో పనిచేస్తూ పోతే కచ్చితంగా అవకాశాలు వస్తాయన్న నమ్మకంతో ముందుకుసాగితే పీవీ నరసింహారావు స్థాయికి ఎవరైనా చేరుకుంటామన్న విశ్వాసం తనకు ఉందని ప్రకటించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ గుప్తా, నిజామాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, బీఆర్‌యస్ నాయకులు మహేష్ బిగాల, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు లేవనెత్తేనా..?
మమ అనిపించేనా..?

- నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ


జెడ్పీ కార్యాలయం

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు (మంగళవారం) జరగనుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు లేవనెత్తుతారా? లేక మమా అనిపిస్తారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రతి జెడ్పీ సమావేశంలో ప్రధాన సమస్యలు చర్చకు రావడం లేదనే ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

జెడ్పీ సర్వసభ్య సమావేశానికి అన్నీ శాఖల జిల్లా అధికారులతో పాటు, ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకావాల్సి ఉంటుంది. ప్రతి మండలంలో ఏయే సమస్యలున్నాయి?, ఆ సమస్యలకు పరిష్కారమేమిటి? గతంలో మంజూరైన నిధులేమిటి?, వాటి పనుల పురోగతి ఎలా ఉంది? అనే వాటితో పాటు ఇతర అంశాలపై చర్చించాలి. కానీ ప్రతి జెడ్పీ సమావేశంలో అధికారులు సమావేశం ప్రారంభించామా.. ముగించామా.. అనే రీతిలో కొనసాగుతోందని ప్రజలు నుంచి విమర్శలు వస్తున్నాయి.

గత జెడ్పీ సమావేశంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు నిర్వహించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. అయితే ఆ శస్త్ర చికిత్సలు జిల్లాలో పెద్దమొత్తంలో చేపట్టడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇవే కాక జిల్లాలో ఎన్నో సమస్యలున్నాయి. అవన్నీ సమస్యలు లేవనెత్తాల్సి ఉంది. కానీ ప్రతి సమావేశంలో పెద్ద ఎత్తున చర్చలు జరగడం లేదనే విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో ప్రధానంగా గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రయినేజీల ఇబ్బందులు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, ఫోల్స్ బిగించడం, ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పన, విద్యార్థుల ఇబ్బందులు ఇలా అనేక సమస్యలపై ప్రజాప్రతినిధులు లేవనెత్తాల్సి ఉంది. కానీ ప్రతి సమావేశంలో పూర్తిస్థాయిలో అధికారులు హాజరుకావడం లేదు. సమస్యలు చర్చకు వచ్చిందీ లేదు. అలాగే సమావేశం ఉదయం 10 గంటలకే ప్రారంభించాల్సి ఉంటుంది. కానీ ప్రతిసారి 11:30కి సమావేశం ప్రారంభించి మమా అనిపిస్తున్నారు. ఈసారైనా సరైన సమయానికి సమావేశం ప్రారంభిస్తారా? లేదా? అనేది వేచి చూడాల్సిందే.

చేనేత వస్త్రాలను ధరించి..
నేత కార్మికులకు అండగా నిలవాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-తాడ్వాయి

చేనేత వస్త్రాలను ధరించి ప్రజలు, నేత కార్మికులకు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. డిఆర్‌డిఒ, చేనేత, జౌళి శాఖ అద్వర్యంలో సోమవారం కామారెడ్డి రోటరీ క్లబ్‌లో ఏర్పాటు చేసిన జాతీయ చేనేత దినోత్సవం వేడుకలలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వారానికి రెండు రోజులు అధికారులు చేనేత వస్త్రాలను ధరించాలని సూచించారు. చేనేత కార్మికులు పోటీతత్వం అలవర్చుకోవాలని అన్నారు. చేనేత వారసత్వ సంపదను కాపాడాలన్నారు. చేనేత కార్మికులు కొత్తగా నైపుణ్యాలు ప్రదర్శించి వస్త్రాలను తయారు చేయాలని కోరారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు చేనేత వస్త్రాలు ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. చేనేత కార్మికులు నూలుతో వస్త్రాలు తయారు చేయడం వల్ల ప్రజలకు ఆరోగ్యం, చల్లదనం, ఆనందం లభిస్తుందని చెప్పారు. ప్రభుత్వం చేనేత కార్మికులకు అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులను కలెక్టర్, డిఆర్‌డిఓ, చేనేత సంఘాల ప్రతినిధులు సన్మానించారు. అంతకుముందు మున్సిపల్ కార్యాలయం నుంచి రోటరీ క్లబ్ వరకు మహిళలు, చేనేత సంఘాల ప్రతినిధులు చేనేత నడక నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు సత్యం, చేనేత సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మి నరసింహులు, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దేవేందర్, సంఘాల ప్రతినిధులు ఐరేని నర్సయ్య, సబ్బని లక్ష్మణ్, హరినాథ్, సిద్దిరాములు, రాజయ్య పాల్గొన్నారు.

ప్రజావాణిలో వచ్చే సమస్యలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలి

- జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సాయాగౌడ్

నవతెలంగాణ-తాడ్వాయి


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజావాణిలో తమ సమస్యలు విన్నవిస్తే పరిష్కారమవుతాయనే నమ్మకంతో ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి వస్తారని, వారి నమ్మ కాన్ని వమ్ము చేయ కుండా ప్రజావాణిలో వచ్చే సమస్యలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించవలసినదిగా జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సాయాగౌడ్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డిఆర్‌డిఓ సాయన్న, సిపిఒ రాజారామ్‌లతో కలిసి సమస్యల పరిష్కార నిమిత్తం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి 59 వినతులను స్వీకరించారు. ఇందులో ప్రధానంగా రెవెన్యూకు సంబంధించి 39, పోలీసుకు సంబంధించి 7 వినతులు వచ్చాయి. వైద్య, ఆరోగ్య శాఖకు సంబంధించి 2, జిల్లా పంచాయతీ అధికారి- 3, డిఆర్‌డిఓ -4, ఎస్సి అభివృద్ధి అధికారి 2, మున్సిపల్, సర్వే అండ్ అండ్ రికార్డ్స్‌కు సంబంధించి ఒక్కొక్క వినతి చొప్పున వచ్చాయి. ఈ సందర్భంగా సాయ గౌడ్ మాట్లాడుతూ.. ఆర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని, లేని వాటికి పరిష్కార మార్గాలు సూచించాలని అన్నారు. ప్రజావాణిలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-భిక్కనూర్

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి దేవేందర్ తెలిపారు. సోమవారం మండలంలోని లక్ష్మీ దేవునిపల్లి గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహించి గ్రామంలో గల పశువులకు టీకాలు వేసి, వర్షాకాలంలో పశువులకు సోకే వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుమలత, పాల కేంద్రం అధ్యక్షులు లోహిత్ రెడ్డి, సొసైటీ ఉపాధ్యక్షులు రాజిరెడ్డి, పాడి రైతులు, పశు వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో గేదె మృత్యువాత

నవతెలంగాణ-బోధన్ టౌన్

పట్టణంలోని పాండుపారం శివారులో విద్యుద్ఘాతానికి గురై ఒక గేదె మృతి చెందింది. మేత కొరకు అటుగా వెళ్లిన గేదెకు కరెంటు తీగలు తగలడంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

గద్దర్ మరణం తీరని లోటు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు
- పలువురి నివాళి

నవతెలంగాణ-విలేకరుల బృందం



కంఠేశ్వర్ : గద్దర్ చిత్రపటానికి నాయకుల నివాళి

కంఠేశ్వర్ : ప్రజా విప్లవ కళాకారుడు కామ్రేడ్ గద్దర్ మరణం తీరని లోటని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. సోమవారం ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ.. ప్రజా కళాకారుడిగా దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజా సమస్యలపై నిత్యం తన గళం విప్పుతూ ప్రజలను చైతన్యం చేసి అనేకమంది విప్లవకారులను తయారు చేసిన కామ్రేడ్ గద్దర్ మరణించటం ప్రజాస్వామిక వాదులకు, కళాకారులకు తీరని లోటని అన్నారు. ఆయన కోరుకున్న సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ తనవంతుగా ప్రయత్నం చేస్తూ ప్రజా కళలను ప్రోత్సహించటమే గద్దర్‌కు నిజమైన నివాళి అని ఆయన అన్నారు. నిజామాబాద్ జిల్లాలో సామాజిక సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన టీమాస్ ఉద్యమం సందర్భంగా రాజీవ్ గాంధీ ఆడిటోరియం వద్ద జరిపిన సభకు గద్దర్ హాజరై తన కళా ప్రదర్శనలను ఇచ్చి ప్రజలను చైతన్యం చేశారని ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్దివెంకట్ రాములు, నూర్జహాన్, ఎం.గోవర్ధన్, జిల్లా కమిటీ సభ్యులు సుజాత, సూరి, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి సిర్ప లింగం, మహేష్, డి.కృష్ణ, అనిత, కళావతి, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్ టౌన్ : పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద గద్దర్ చిత్రపటానికి సీఐటీయూ నాయకులు శంకర్‌గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీఐటీయూ నాయకులు శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. 'కామ్రేడ్ గద్దర్ అమర్ రహే.. కామ్రేడ్ గద్దర్ అమర్ రహే.. సాధిస్తాం గద్దర్ ఆశయాలను సాధిస్తాం.. సాధిస్తాం..' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో గంగాధర్, గ్రామపంచాయతీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ : డోంగ్లి మండలంలోని పెద్దటాక్లి గ్రామంలో ప్రజా యుద్ధ నౌక గద్దర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు విలాస్ గైక్వాడ్ మాట్లాడుతూ ప్రజా యుద్ధనౌక గాయకుడు గద్దర్ మరణం రాష్ట్ర ప్రజానీకానికి తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ యాదవ్ రావు పటేల్, సామాజిక కార్యకర్త సాయిలు గొండ, వార్డ్‌మెంబర్ దిలీప్ కుమార్, మాధవ్, ప్రజలు నజీరసాబ్, పాషా మెస్త్రీ, రోహిదాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : తెలంగాణ రాష్ట్రానికి గద్దర్ మరణం తీరని లోటని సీపీఐఎంఎల్ ప్రజాపంథా మండల కార్యదర్శి నసీర్ స్పష్టం చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల జిల్లా నాయకులు నడిపి నాగన్న, వడ్డెన్న, పెద్దలు, పోశెట్టి, సాయిలు, సంతోష్, మన్నె పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.


బోధన్‌టౌన్ : నివాళులర్పిస్తున్న నాయకులు

గ్రామాల అభివృద్ధికి అధిక నిధులు

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

నవతెలంగాణ-భిక్కనూర్


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్

గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. సోమవారం పెద్ద మల్లారెడ్డి గ్రామంలో 17 కోట్ల 70 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసి గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడం జరుగుతుందని, చిన్న గ్రామాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న పలు సమస్యలను ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇల్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని, సొంత స్థలంలో ఇంటి నిర్మాణం చేసుకుంటే గృహలక్ష్మి పథకం కింద మూడు లక్షల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు.

మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు అండగా ఉండాలి..

వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు ఎల్లవేళలా అండగా ఉండి మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ తెలిపారు. సోమవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో నూతన అధ్యక్షులు హనుమంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ పురాం రాజమౌళి, డైరెక్టర్ రాకేష్‌రెడ్డి పదవీ బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు, సహకార సంఘాలకు అన్ని విధాలుగా సహకరించి, మార్కెట్ కమిటీ ఆదాయాన్ని పెంచేందుకు పాలకవర్గం కృషి చేయాలన్నారు. అనంతరం పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యే గోవర్ధన్‌ను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గాల్‌రెడ్డి, జడ్పీటీసీ పద్మా నాగభూషణంగౌడ్, డీసీసీబీ డైరెక్టర్ లింగాల కిష్టగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు నరసింహారెడ్డి, పట్టణ అధ్యక్షులు మల్లేశం, రైతు సమన్వయ కమిటీ మండల కన్వీనర్ రామచంద్రం, సిద్దిరామేశ్వర ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్య మంత్రిని నేనే పోటీ చేయమని చెప్పా..

ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కామారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీ చేయమని తానే చెప్పినట్లు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ సొంత గ్రామం బీబీపేట్ మండలంలోని కోనాపూర్ గ్రామమని అక్కడ మానేరు నిండి పొలాలు మునిగిపోవడంతో ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం చింతమడకకు వలస వెళ్లిందని ఆయన పుట్టిన నియోజకవర్గం కాబట్టి బాధ్యతగా తన సొంత నియోజకవర్గంలో నుంచి పోటీ చేయమని తానే స్వయంగా మూడుసార్లు విన్నవించానని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేస్తే తన భవిష్యత్తును ముఖ్యమంత్రి నిర్ణయిస్తారని, ముఖ్యమంత్రి కేసీఆర్ పోటీ చేయకపోతే తానే పోటీలో ఉంటానని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నాయకులు తాను గెలువనని ముఖ్యమంత్రిని కామారెడ్డికి తీసుకువస్తున్నారని అసత్యపు ప్రచారం చేస్తున్నారని గత రెండు పర్యాయాలు తాను ఓడిపోతున్నానని ఎన్నికలు పూర్తయిన తర్వాత కూడా చెప్పారని ప్రజల ఆశీస్సులతో ప్రతిసారి తానే గెలిచానని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పోటీ చేయకుంటే మరోసారి తానే పోటీ చేసి విజయం సాధిస్తానని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు.

సర్వసభ్య సమావేశానికి అధికారులు గైర్హాజరు



వివరాలు వెల్లడిస్తున్న ఫారెస్టు అధికారి

నవతెలంగాణ-సదాశివనగర్

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ గైని అనుసూయ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వసభ్య సమావేశానికి పలువురు అధికారులు గైర్హాజరయ్యారు. రేషన్ కార్డులు ఆన్లైన్లో డివైడ్ చేసుకోవాలని, అందుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ అన్నారు. అటవీ ప్రాంతంలో మొక్కలు నాటితే సమాచారం ఎందుకు ఇవ్వలేదని సదాశివనగర్ సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బషీర్‌ను ప్రశ్నించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు నివేదికలు చదివి వినిపించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కమిటీ నర్సింలు, మార్కెట్ కమిటీ చైర్మన్ పులగం సాయిరెడ్డి, రైతుబంధు అధ్యక్షులు ఏలేటి భూమిరెడ్డి అధికారులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

- తెలంగాణ రైతు సంఘం అధ్యక్షులు గంగాధరప్ప


వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కోటగిరి

వర్షాలకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, ముందస్తుగా నాట్లు వేయడంతో పంట నష్టం వాటిల్లిందని ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం అధ్యక్షులు గంగాధరప్ప డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఇంచార్జ్ తహసీల్దార్ అజీజ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు నీరడి గంగామణి, నాయకుడు లక్ష్మణ్, నాగరాజు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు సర్పంచ్, ఉపసర్పంచ్ వార్డు సభ్యుల రాజీనామా

నవతెలంగాణ-లింగంపేట్


రాజీనామా పత్రాలను చూపుతున్న దృశ్యం

మండలంలోని మాలోత్ తండా గ్రామ పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్స్ బీఆర్ఎస్ పార్టీకి సోమవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సునీత ప్రకాష్ నాయక్, ఉప సర్పంచ్ సుమన్ నాయక్, వార్డ్ మెంబర్ లాల్ సింగ్ నాయక్ మాట్లాడారు.. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ కాయితి లంబాడీలను అసెంబ్లీ సాక్షిగా బీసీలను, ఎస్టీ జాబితాలో చేరుస్తానని అనుచిత వ్యాఖ్యలు చేశారని, దానికి నిరసనగా బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశామని అన్నారు. ఎమ్మెల్యే సురేందర్ అసెంబ్లీ సాక్షిగా బీసీలను ఎస్టీ జాబితాలో చేర్పిస్తామనడం బాధాకర విషయమని తెలిపారు. అలాగే గ్రామానికి సంబంధించిన పోడు భూమి పట్టాలు 90 మందికి రావాల్సి ఉంటే 10 మందికి మాత్రమే ఇప్పించారని, అందుకే బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నామని తెలిపారు.

నవతెలంగాణ
నిజామాబాద్
2
మంగళవారం 08 ఆగస్టు 2023

ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహిద్దాం : ఏఐఎస్ఎఫ్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 88వ ఆవిర్భావ దినోత్సవం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని నాయకులు అన్నారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ 1936 ఆగస్టు 12న ఉత్తర ప్రదేశ్, లక్నో జిల్లా బెనారస్ యూనివర్సిటీలో ఏర్పడిందన్నారు. ఆనాడు స్వతంత్ర ఉద్యమంలో కీలకపాత్ర వహించి దేశం కోసం అలుపెరగని పోరాటాలు నిర్వహించిందన్నారు. చదువు, పోరాడు అనే నినాదంతోటీ నిరంతరం దేశవ్యాప్తంగా విద్యార్థుల సమస్యల పైన అలుపెరగని పోరాటాలు చేస్తుందన్నారు. ఈనెల 12న ఏఐఎస్ఎఫ్ పతాకావిష్కరణ చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, జిల్లా సహాయ కార్యదర్శి కుశాల్, జిల్లా కమిటీ సభ్యులు దినేష్, చోటు, తరుణ్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



నూతనంగా వచ్చిన తహసీల్దార్ ఎంఎ ఖలీమ్‌ను శాలువాతో మండల ప్రజా ప్రతినిధులు సోమవారం సన్మానించారు. ఎంపీపీ కుంచాల విమల రాజు, వైస్ ఎంపీపీ తిరుపతి రెడ్డి, ఎంపిటిసి పోతే రాజు, జక్రాన్ పల్లి మండల కోఆప్షన్ బుల్లెట్ అక్బర్ ఖాన్, సర్పంచ్ సురేష్, మునిపల్లి రాజరెడ్డి, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఏఎన్ఎంలందరినీ రెగ్యులర్ చేయాలి

● **సిఐటీయు జిల్లా కార్యదర్శి నూర్జహాన్**

నవతెలంగాణ-కంఠేశ్వర్

వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఏఎన్ఎం అందర్నీ యధావిధిగా రెగ్యులర్ చేయాలని సిఐటీయు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. సోమవారం నిజామాబాద్ కలెక్టర్ కార్యాలయం వద్ద తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటీయు ఆధ్వర్యంలో కాంట్రాక్టు ఏఎన్ఎంలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటీయు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ యూనియన్ జిల్లా నాయకురాలు విక్టోరియా మాట్లాడుతూ.. వైద్య, ఆరోగ్య శాఖ కాంట్రాక్ట్ ఎనిహెచ్ఎ(ఎఫ్)లను రెగ్యులర్ చేయాలని, నోటిఫికేషన్ 2/2023 క్యాన్సిల్ చేయాలని అన్నారు. నోటిఫికేషన్ నెం. 02/2023 తేదీ: 26-07-2023 ఎంపిహెచ్ఎ(ఎఫ్), రాష్ట్ర ప్రభుత్వం ఎంపిహెచ్ఎ(ఎఫ్) పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ 2/2023ను జారీ చేసిందన్నారు. 1,520 పోస్టుల భర్తీ కోసం రాత పరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తామని, కాంట్రాక్ట్ సర్వీస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు 20 మార్కులు సర్వీస్ వెయిటేజి ఇచ్చారని, మిగిలిన 80 మార్కులు పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారని తెలిపారు.



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న కాంట్రాక్టు ఏఎన్ఎంలు

వయస్సు పరిమితి కూడా 44 ఏండ్లని, ఎస్సి, ఎసి, బిసి తదితరులకు అదనంగా 5 సంవత్సరాలు సడలింపు ఇచ్చారని అన్నారు. నోటిఫికేషన్ ప్రకారం 49 సంఎఎలు దాటిన వారు అప్లై చేసుకోవడానికి కూడా అర్హులు కారని, ఇటువంటి నిబంధనల వల్ల కాంట్రాక్ట్ సర్వీసులో పనిచేస్తున్న 2వ ఏఎన్ఎం, ఇసి ఏఎన్ఎం, అర్బన్ హెల్త్ సెంటర్స్ ఏఎన్ఎంలు, హెచ్ఐ ఏఎన్ఎంల పేరిట పనిచేస్తున్న సుమారు 5 వేల మందికి న్యాయం జరగదని తెలిపారు. వీరందరూ 20 ఏండ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారని, వీరిందరినీ యదావిధిగా ఖాళీ పోస్టుల్లో సీనియారిటీ ప్రకారం రెగ్యులర్ చేయడం వల్ల న్యాయం జరుగుతుందని తెలిపారు. డిఎస్సి ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్, మెరిట్ ప్రకారం ఎంపికై పని చేస్తున్నారని, మళ్ళీ పరీక్ష రాయమనడం న్యాయం కాదని తెలిపారు. చాలా మందికి ఏజ్ బార్ అయిందని, ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖలోని కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణకు విధి విధానాల విషయంలో ద్వంద్వ ప్రమాణాలు అనుసరించడం శోచనీయమని అన్నారు. కాంట్రాక్ట్ మెడికల్ ఆఫీసర్లను మెరిట్ ఆధారంగా సర్వీసుకు వెయిటేజి ఇచ్చి రెగ్యులర్ చేశారని, అలాగే జీఓ నెం. 16 ది. 26-02-2016 ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు సంబంధించి తేది: 03-05-2023న జీఓ నెం. 49 ప్రకారం 68 మంది కాంట్రాక్ట్ ఎంపిహెచ్ఎ (ఫిమేల్) లను యదావిధిగా రెగ్యులర్ చేశారని అన్నారు. వివిధ శాఖల్లో కూడా రాష్ట్ర ప్రభుత్వం సుమారు 5 వేలకు పైగా కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేశారని అన్నారు. నోటిఫికేషన్ 02/2023ని క్యాన్సిల్ చేయాలని కోరారు. మిగిలిన 5వేల మంది కాంట్రాక్ట్ ఎంపిహెచ్ఎ (ఫిమేల్)లను సీనియారిటీ ప్రకారం ఖాళీ పోస్టులలో రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జ్యోతి శశికళ రూప సునీత సమంత స్రవంతి సవిత, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల బతుకుల్లో వెలుగులు ఎప్పుడు?

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల బతుకుల్లో వెలుగులు నింపేదెప్పుడని తమను రెగ్యులరైజ్ చేసే విధంగా ప్రభుత్వం వెంటనే స్పందించి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం యూనివర్సిటీ లో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఘం అధ్యక్షులు, జాక్ కో కన్వీనర్ వి దత్తాహరి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న 12 యూనివర్సిటీలకు చెందిన కాంటాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శరత్, డాక్టర్ గోపి రాజ్, డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ గంగా కిషన్ , స్వామి రావు, జోష్న, రాజేశ్వర్ ,అపర్ణ ,గంగాధర్, నాగేశ్వరరావు, రాములు, బిఆర్ నేత, గంగాధర్, దేవరాజ్ శ్రీనివాస్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విజయ్ స్కూల్ విద్యార్థులు



రాష్ట్ర యోగాపోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న అమృతలత

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విజయ్ స్కూల్ విద్యార్థులు నిజామాబాద్ జిల్లా యోగా అసోసియేషన్ స్పోర్ట్స్ వారి ఆధ్వర్యంలో ఆదివారం శ్రీరామకృష్ణ సేవాసమితిలో జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజయ్ హైస్కూల్ విద్యార్థులు యం. వర్షిత(10వ తరగతి) రెండవస్థానం, పి. సాయిచరణ్ (9వ తరగతి) ఐదవ స్థానం సాధించారు. యం. సాహిత్య (8వ తరగతి), శ్రీవల్లి, ఎం.సుదీంద్ర (10వ తరగతి) జిల్లాస్థాయిలో గెలుపొంది, సెప్టెంబర్ నెలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని విజయ్ హైస్కూల్ వ్యవస్థాపకులు డాక్టర్ అమృతలత అన్నారు. జిల్లాస్థాయి నుండి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను యాజమాన్యం అభినందించారు.

అమెరికాలో తీజ్ పండగ



తీజ్‌లో పాల్గొన్న యువతులు, మహిళలు

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని పందిమడుగు దుపియా తాండకు చెందిన వ్యక్తి, గ్లోబల్ అసోసియేషన్ డైరెక్టర్ ఫూల్‌సింగ్ ఆధ్వర్యంలో అమెరికాలో గిరిజనుల పండగ తీజ్‌ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్లోబల్ గోర్ బంజారా అసోసియేషన్ డైరెక్టర్ ఫుల్ సింగ్, జీజీఏ ప్రెసిడెంట్ సలావత్ శంకర్, డాక్టర్ రాజేష్, మహబూబ్ నగర్ రమేష్, అనంతపురం గీత, భూక్య తుకారం తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల రాస్తారోకో

గద్దర్‌కు జీపీ కార్మికుల నివాళి

నవతెలంగాణ-విలేకరులు

డిచ్‌పల్లి: గ్రామ పంచాయతీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ వద్ద సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మురళి, గంగాధర్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు జీవో నెంబర్ 60 ప్రకారంగా వేతనాలు ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజేందర్, బాబు, రమేష్, నాగరాజు, సాయిలు, రాజేశ్వర్, భూమయ్య రవి, సాయిలు, గంగాధర్, మహేష్ పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : సమస్యలు పరిష్కరించాలంటూ మండలకేంద్రంలో గ్రామ పంచాయతీ సిబ్బంది బస్టాండ్ వద్ద రాస్తారోఖో నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు ప్రజా గాయకుడు గద్దర్‌కు చిత్రపటానికి పంచాయతీ సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి గ్రామ పంచాయతీ రాష్ట్ర కన్వీనర్ దాసు హాజరై మాట్లాడుతూ.. గద్దర్ సేవలను కొనియాడారు.

సిరికొండ: జిపి కార్మికుల సమ్మె 33వ రోజుకు చేరుకున్న సందర్భంగా మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం కార్మికులను చిన్నచూపు చూడడం సరైన విధానం కాదని ఐఎఫ్ టి యు జిల్లా నాయకులు రమేష్ అన్నారు. కార్యక్రమంలో సిపిఎంఎల్ ప్రజాపంథా మండల నాయకులు సాయిరెడ్డి, నాయకులు కిషోర్, బబ్ల్యూ, జీపీ కార్మికులు రాజన్న , గంగన్న తదితరులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి: రాస్తారోకో చేస్తున్న జీపీ కార్మికులు

నవీపేట్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అసెంబ్లీలో 20 మంది ఎమ్మెల్యేలు మాట్లాడిన ప్రభుత్వం స్పందించకపోవడంతో మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాయక్ వాడి శ్రీనివాస్ మాట్లాడుతూ పంచాయతీ సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని అసెంబ్లీలో అధికార, ప్రతిపక్ష 20 మంది ఎమ్మెల్యేలు మాట్లాడిన రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, భుజంగరావు, నరేష్, తులసిరామ్, పోసాని పోశెట్టి పాల్గొన్నారు. అంతకుముందు సమ్మె శిబిరం వద్ద ప్రజాయుద్ధనౌక గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



నవీపేట్‌లో..



సిరికొండలో..

పంటనష్టపరిహారం రూ.20వేలు ఇవ్వాలి

● **తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఎమ్మార్వో కు వినతి**

నవతెలంగాణ- నవీపేట్

భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు 20వేల రూపాయల ఆర్థిక సహకారం అందించాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఎమ్మార్వో ధన్వల్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మండలంలో కురిసిన భారీ వర్షాలకు మాటు కాలువ కట్ట తెగిపోయి లింగాపూర్, నిజాంపూర్ రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. నష్టపోయిన రైతులకు 20వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవేందర్ సింగ్, సుదర్శన్, రాజశేఖర్, గంగాధర్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గద్దర్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై నెలకొల్పాలి : సీపీఐ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజా యుద్ధ నౌక గద్దర్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై నెలకొల్పాలని సీపీఐ నాయకులు అన్నారు. సోమవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశం సందర్భంగా గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కే.భూమయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ.. విట్టల్ రావు (గద్దర్) చిన్ననాటి నుండి విద్యార్థులను, కార్మికులను ఐక్యం చేయడం కోసం ఎన్నో త్యాగాలు చేయడం జరిగిందన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కళాకారులు గద్దర్ అని అన్నారు. ఆయనమరణం తెలంగాణ రాష్ట్రానికి, ఆయన కుటుంబానికి తీరని లోటు అని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ప్రతిష్టింపజేయాలని అన్నారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా నాయకులు ఏ.రాజేశ్వర్, వై.రాజిరెడ్డి,వై ఓమయ్య, కే.రాజన్న, బి.రఘురాం పి.హనుమాన్లు పాల్గొన్నారు.



నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

తల్లిపాల వారోత్సవాలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని రెండో వార్డు పరిధిలోగల అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు, సీమంతాలు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కౌన్సిలర్, ప్రముఖ మహిళా న్యాయవాది, లీగల్ కౌన్సిల్ మెంబర్, బార్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షులు సంగీతా ఖాందేష్ హాజరయ్యారు. ఈసందర్భంగా సంగీతా ఖాందేష్ మాట్లాడుతూ.. పిల్లలకు తల్లిపాల ఆవశ్యకత, గర్భిణీ స్త్రీలు పాటించాల్సిన వివరించారు. కార్యక్రమంలో ఖాందేష్ నాగలత, సరిత, మమత, జరీనా, కవిత, మాధురి, శ్రీలత, శ్రీలేఖ, గంగా భవాని, నవనీత, రామ లత తదితరులు పాల్గొన్నారు.

చలో కోరుట్ల వేలాదిగా తరులుదాం

● **పోస్టర్ల ఆవిష్కరణ**

నవతెలంగాణ-డిచ్‌పల్లి

చలో కోరుట్ల కార్యక్రమానికి వేలాదిగా తరలి వెళ్దామని మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సోమవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి సంఘ సభ్యులందరూ వచ్చి కోరుట్లలో జరిగే పద్మశాలి రాజకీయ యుద్ధభేరిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్గం హన్మాండ్లు, నగర అధ్యక్షుడు గుజ్జేటి వెంకట నర్సయ్య, రూరల్ కన్వీనర్ తన్నీరు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిలువేరి దాసు, జిల్లా కార్యవర్గ సభ్యులు బింగి మోహన్, శక్కరికొండ కృష్ణ, విట్టల్ పద్మశాలి సంఘ సభ్యులు ఆవిష్కరించారు.

యువకుడి సెల్ఫీ సూసైడ్ కలకలం

● **ఆస్థివిషయంలో అన్నదమ్ముల మధ్య గొడవ**

● **ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ తమ్ముడు అనిల్**

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఆస్తి తగదాలతో అన్నదమ్ముల మధ్య గొడవతో మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో సెల్ఫీ వీడియో తీస్తూ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు ఓ యువకుడు. స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని ధర్మారం (బి) గ్రామానికి చెందిన అనిల్ ఆస్తి విషయంలో అన్నదమ్ముల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దానిలో భాగంగానే ఆదివారం రాత్రి గొడవ చోటుచేసుకోవడంతో మనస్థాపానికి గురైన తమ్ముడు అనిల్ సెల్ఫీ వీడియో తీసి పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అనిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే సెల్ఫీ సూసైడ్ అటెంప్ట్ వీడియోను తన పదోతరగతి స్నేహితులకు సంబంధించిన వాట్సాప్ గ్రూప్ లో పోస్ట్ చేశాడు. ఇంట్లో ఆస్తి తగాదాల వల్ల ఆత్మహత్యయత్నానికి పాల్పడుతున్నట్లుగా ఆ వీడియోలో స్పష్టంగా పేర్కొన్నాడు. న్యాయం చేస్తామని పంచాయతీ పెట్టించి చివరికి తనకు అన్యాయం చేశారని అనిల్ వాపోయాడు. స్నేహితులను విడిచి పోతున్నందుకు చాలా బాధగా ఉందని, తన భార్య, పిల్లలకైన న్యాయం చేయాలని అనిల్ తన గోడును వెళ్లగక్కి పురుగుల మందు తాగాడు. ఇదే విషయమై డిచ్ పల్లి ఎస్ఐని వివారణ కోరగా కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.



చికిత్స పొందుతున్న యువకుడు

ఎస్ఐ కొలువు సాధించిన శ్రీ సాయి

● **పలువురి అభినందన**

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రానికి చెందిన యువకుడు సల్లూరి శ్రీ సాయి పోలీస్ సివిల్ ఎస్ఐ ఉద్యోగాన్ని సాధించాడు. మండల కేంద్రంలోకి చెందిన సల్లూరి కిషన్ గౌడ్- లక్ష్మీ దంపతుల కుమారుడైన శ్రీ సాయి ఆదివారం వెలువరించిన టిఎస్ ఎల్ పిఆర్ బి ఫలితాల్లో బాసర జోన్ లో ప్రథమ స్థానంలో నిలిచి ఎస్ఐ ఉద్యోగాన్ని సాధించుకున్నాడు. శ్రీ సాయి 1 నుండి 5వ తరగతి వరకు జిల్లాలోని ఆర్మూర్ మండలం పెర్కిట్ లో భరత్ చంద్ర స్కూల్లో చదివాడు. 6 నుంచి ఇంటర్మీడియట్ వరకు నిజాంసాగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో చదువుకున్నాడు. జగిత్యాల జిల్లా నాచుపల్లి లో ఇంజనీరింగ్ పూర్తి చేసి రెండు సంవత్సరాలుగా ఎల్ అండ్ టిలో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. శ్రీ సాయి 27 సంవత్సరాల వయస్సు లోనే తొలి ప్రయత్నంలోనే ఎస్ఐగా కొలువు సాధించాడు. తండ్రి సల్లూరి కిషన్ గౌడ్ ప్రభుత్వ ఉపాధ్యాయులు కాగా, తల్లి లక్ష్మి గృహిణి. మిత్రులు, గ్రామస్తులు శ్రీ సాయి కుటుంబ సభ్యులను కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బాల్కొండ బిజెపి నాయకులు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డి శ్రీ సాయిని శాలువాతో సత్కరించి అభినందించారు.



శ్రీసాయిని సన్మానిస్తున్న పలువురు

శ్రీసాయికి ఎస్ఐ అభినందన

కమ్మర్ పల్లి పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ రాజశేఖర్ శ్రీసాయిని శాలువా పూలమాలతో సత్కరించి మిఠాయి తినిపించారు. మొదటి ప్రయత్నంలోనే సివిల్ ఎస్ఐగా కొలువు సాధించడం పట్ల అభినందించారు.

అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకులను మాట్లాడనివ్వరా?

● **కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్ రెడ్డి**

నవతెలంగాణ-కంఠేశ్వర్

అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకులను మాట్లాడనివ్వరా? అని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ భవన్‌లో పీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్‌బిన్ హందాన్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశవేణుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రతిపక్ష ఏదైనా మాట్లాడిన ముకుమ్మడిగా వారిపై దాడి చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీధర్ బాబు చెక్ డ్యామ్‌లు శాస్త్రీయంగా నిర్మాణం కాలేదని మాట్లాడితే దానిని మార్చేసి కాంగ్రెస్ చెక్ డ్యామ్‌లనే వద్దంటుందని కేటీఆర్ మాట్లాడుతున్నాడని అన్నారు. కమిషన్ల కోసం కట్టిన చెక్ డ్యాంవల్ల పంటలు నష్టపోతున్నాయని, రాష్ట్రమంతటా ఒకేలా చెక్ డ్యామ్ డిజైన్ చేశారని, తద్వారా చాలా ప్రాంతాలలో పంటలు నష్టపోయాయని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి నియోజకవర్గంలో చాలా పంటలు చెక్ డ్యామ్ ద్వారా నష్టపోయారని, మంత్రి హరీష్ రావు, మంత్రి కేటీఆర్ నియోజకవర్గాలలో చాలామంది పంటలు నష్టపోయారని ఆయన అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో రైతుల నష్టపరిహారంపై చర్చించలేదని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు నష్టపరిహారం ఏ పంటకు ఎంత అని ప్రశ్నిస్తే మంత్రి కేటీఆర్ నివేదిక రాకముందు ఎలా చెప్తామని అన్నారని చెన్నారు. మే నెలలో అకాల వర్షాలతో పంటలను నష్టపోతే కేసిఆర్ ఏ విధంగా నివేదిక రాకముందే వరి పంటకు పదివేల రూపాయల నష్టపరిహారం ప్రకటించాడో చెప్పాలని ప్రశ్నించారు. నివేదిక అనేది పొలం ఎన్ని ఎకరాలు నష్టపోయారు మాత్రమే చెప్తుందని, ఏ పంటకు ఎంత నష్టపరిహారం ఇవ్వాలో చెప్పడానికి ఎందుకు ఆలోచిస్తున్నాడో సమాధానం చెప్పాలని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేస్తుందని అంటున్నారని, రైతుబంధుకు ధరణికి సంబంధమే లేదని, ధరణి అనేది ఆన్లైన్ వెబ్సైట్ మాత్రమే అని అన్నారు. కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి, రాజా నరేందర్ గౌడ్, సంతోష్, రామకృష్ణ ,కేశ మహేష్, శోభన్ ,ఆవిన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి

ప్రజావాణికి 103 ఫిర్యాదులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 103

ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని ఫిర్యాదుదారులు తమ సమస్యలను కమిషనర్ తో పాటు, జెడ్పి సీఈఓ గోవింద్, డీఆర్డీఓ చందర్, డీపీఓ జయసుధ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

మున్ముందు మరింత ప్రజాసేవ చేస్తా

● **తూము శరత్ రెడ్డి**

నవతెలంగాణ-నవీపేట్

మున్ముందు మరింత ప్రజాసేవ చేస్తానని తూము శివమ్మ ట్రస్ట్ చైర్మన్ శరత్ రెడ్డి అన్నారు. మండలంలోని ధర్మారం(యం) గ్రామంలో నిరుపేదలకు బియ్యం సంచి, నిత్యావసర వస్తువులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో పేద ప్రజలకు సేవ చేసేందుకు ముందు వరుసలో ఉంటానని అన్నారు. బోధన్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో నిరుపేదలను గుర్తించి నిత్యావసర వస్తువులను పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ చైర్మన్ తూము పద్మ శరత్ రెడ్డి కౌన్సిలర్లు శ్రీకాంత్ గౌడ్, పిట్ల సత్యం, మహేందర్ రెడ్డి, రాజయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో మిషన్ ఇంద్రధనుష్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణం ఆరోగ్య కేంద్రంలో సోమవారం చిన్నపిల్లలకి ఇచ్చే నెలవారి వ్యాక్సీన్లు ఇంతకుముందు పొందని వారికి ప్రత్యేక వాక్సినేషన్ కార్యక్రమం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అశోక్, డిప్యూటీ డిఎంహెచ్‌వో డాక్టర్ రమేష్, మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పుట్టిన ప్రతి చిన్నారి నుండి 16 సంవత్సరాలలోపు వారికి ఇచ్చే వ్యాక్సీన్లు అనివార్య కారణాలవల్ల పొందని వారికోసం ఈ ప్రత్యేక వాక్సినేషన్ డ్రైవ్‌ను జిల్లా వ్యాప్తంగా 12 వరకు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్విని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ అధికారులు కృష్ణమూర్తి, సాయి, చంద్రశేఖర్, ఆర్మూర్ పట్టణ వైద్యాధికారిని స్రవంతి, ఆశాలు, అనురాధ, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా మాలతి బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ ధర్పల్లి



బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ మాలతి

ధర్పల్లి తహసీల్దార్‌గా మాలతి సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఇదివరకు విధులు నిర్వహించిన గంగప్రసాద్ కామారెడ్డి జిల్లాకేంద్రానికి బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. నూతనంగా వచ్చిన తహసీల్దార్ మెదక్ జిల్లా నుండి బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆమెకు శాలువా, పూల బొకేతో సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్, ఆర్ఐ రవి,ఆదర్శ, జలంధర్, తదితరులు ఉన్నారు.

పోస్టాఫీసుల ద్వారా ..

జాతీయ జెండాలు అమ్మకానికి సిద్ధం

నవతెలంగాణ-ఆర్మూర్

డివిజన్‌లోని ప్రతీ బ్రాంచ్ పోస్టాఫీసులలో అజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా జెండా ఉత్సవాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సహాయ పర్యవేక్షకురాలు యాపరు సురేఖ మాట్లాడుతూ ప్రతీ గ్రామంలోని బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ లో జాతీయ జెండాలను 25 రూపాయలకు విక్రయించడం జరుగుతుందన్నారు. ప్రతీ గ్రామంలోని బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌లో ప్రజలకు అందుబాటులో జెండాలు అమ్మకానికి సిద్ధంగా చేస్తున్నట్లు తెలిపారు. జెండాలు కావలసినవారు ఆన్ లైన్ ద్వారా www.epost office.gov.in వెబ్సైట్లో కూడా ఆర్డర్ చేయవచ్చునని అన్నారు. వారికి ఏరియా పోస్ట్ ఆఫీస్ ద్వారా డెలివరీ చేస్తారన్నారు. విద్యా సంస్థలు ప్రైవేట్ / ప్రభుత్వ సంస్థలలో ఎక్కువ మొత్తంలో జెండాలు అవసరమున్నవారు తమ దగ్గరలోని పోస్ట్ ఆఫీస్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

స్వచ్ఛంద బంద్ పాటించి.. దీక్షలో వ్యాపారస్తులు

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలో రైతులు చేపట్టిన దీక్షకు మద్దతుగా.. సోమవారం వ్యాపారస్తులు స్వచ్ఛందంగా బంద్ పాటిస్తూ దీక్షలో కూర్చున్నారు. గత 42 రోజులుగా రోడ్ల మరమ్మతులను పూర్తి చేయాలని కోరుతూ రైతులు దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. దీక్షలో వ్యాపారులు సాయిబాబా గౌడ్, ఆకుల బుజ్జి, సాయ గౌడ్, గాండ్ల అబ్బాన్న, అల్ల కొండ సాయిలు, నాగనాథ్, కందకుర్తి సాయిలు, పండరి సెట్, కటికల హుస్సేన్, కటికల ఆనంద్, గాండ్ల రాములు, చందర్ రైతులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో సంపూర్ణ బంద్..

మండల కేంద్రంలో రైతుల దీక్షకు వ్యాపారస్తులు స్వచ్ఛంద బంద్ పాటిస్తూ దీక్షలో కూర్చున్నారు. మెడికల్ దుకాణాలు తప్ప మిగతా అన్నింటిని స్వచ్ఛందంగా మూసి వేశారు. దీంతో మండల కేంద్రంలోని ప్రధాన వీధులు నిర్మానుష్యంగా మారాయి.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని ఖండేభల్లూర్ జీపీ పరిధిలో సీసీ రోడ్డు పనులను బీఆర్ఎస్ నాయకులు స్థానిక సర్పంచ్ మహానందతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నీలుపటేల్ మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటికే పలు గ్రామాల్లో అత్యవసరం ఉన్న చోట పార్టీలకు అతీతంగా గ్రామగ్రామాలకు సీసీ రోడ్లు మంజూరు చేసి పూర్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్ విరేశం, విండో చైర్మెన్ శివానంద్, మాజీ విండోచైర్మెన్ రాజుపటేల్, మాజీ ఎంపీపీ శెట్కార్ బస్వంత్ పటేల్, బీఆర్ఎస్ నాయకుడు నీలుపటేల్, శివరాజ్ దేశాయి, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

మీనమేషాలు లెక్కిస్తున్న ప్రభుత్వం

- 33వ రోజుకు జీపీ కార్మికుల సమ్మె
- పలుచోట్ల రాస్తారోకోలు
- విరమింపజేసిన పోలీసులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

గ్రామపంచాయతీ కార్మికులు, సిబ్బంది సమస్యల పట్ల ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని సీఐటీయూ నాయకులు విమర్శించారు. జీపీ కార్మికులు, సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 33వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా జీపీ కార్మిక సంఘాల జేఏసీ పిలుపులో భాగంగా పలుచోట్ల సోమవారం రాస్తారోకోలు నిర్వహించారు. అయితే కొన్నిచోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

కోటగిరి : మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు రాస్తారోకో నిర్వహించడంతో అరగంట సేపు ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. నెల రోజులుగా సమ్మె నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని సీఐటీయూ జిల్లా నాయకులు నన్నేసాబ్ పేర్కొన్నారు. న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఉద్యమాన్ని ఉధృతం చేశామని తెలిపారు. వీరికి బాన్సువాడ తెలుగుదేశం ఇన్చార్జ్ కరాటే రమేష్ సంఘీభావం తెలిపారు. మండల అధ్యక్షురాలు రాజేశ్వరి ఆధ్వర్యంలో కార్మికులు పెద్ద ఎత్తున రాస్తారోకోకు తరలివచ్చారు. ఎస్ఐ సందీప్ ఘటన స్థలానికి చేరుకొని పంచాయతీ కార్మికులకు ఒప్పించి రాస్తారోకో విరమింపజేశారు.



కోటగిరిలో రాస్తారోకో చేపట్టిన కార్మికులు



రెంజల్‌లో తహసీల్దార్ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా

ఎడపల్లి : మండల కేంద్రంలో జీపీ కార్మికులు రాస్తారోకోను నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు బి.మల్లేష్, జే.గంగాధర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి కే. రవి, వైద్యనాథ్, గ్రామపంచాయతీ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు వై.లక్ష్మి, శ్రీను, గంగాధర్, సాయిలు, కే.సంతోష్, జే.పద్మ, పి.పండరి, రాజయ్య, పి.రాజమణి తదితరులు పాల్గొన్నారు.

వర్ని : తమ హామీలు అమలు చేయటంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని జీపీ కార్మికులు వర్ని, రుద్రూర్ మండలాల్లో రాస్తారోకో చేపట్టారు. కేసీఆర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. గంట పాటు రాస్తారోకో చేయగా.. పోలీసులు అక్కడికి చేరుకుని రాస్తారోకోను చెదరగొట్టారు. దీంతో కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యలపై ప్రభుత్వానికి తెలిపేందుకు రాస్తారోకో చేస్తే పోలీసులు బయపెట్టడం సరికాదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. 30 రోజులకుపైగా సమ్మె చేస్తున్నా తెలంగాణ పంచాయతీ శాఖ మంత్రికి పట్టింపు లేకుండా పోయిందని అన్నారు. తమ డిమాండ్లను, కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నేసాబ్, కార్మికులు సాయిలు, సాయికిరణ్ ఎల్.గంగారాం, సాయవ్వ తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : మండల పారిశుధ్య కార్మికులు తమ సమస్యలపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రధాన రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. తెలంగాణ పంచాయతీ కార్మిక జేఏసీ జిల్లా అధ్యక్షులు జంగం గంగాధర్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులలో 99శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారే ఎక్కువ సంఖ్యలో ఉన్నారని తెలిపారు. రాబోవు కాలంలో ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెప్తామని ఆయన హెచ్చరించారు. కార్మికులకు ఐడీ కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు ఫసివుద్దీన్, కార్యదర్శి బి.సాయిలు, యాదగిరి, లాలు, 45 మంది పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

'పవార్ శిరీష'కు సివిల్ పోలీస్‌లో 17వ ర్యాంక్



పవార్ శిరీష

నవతెలంగాణ-బిచ్కుంద

జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన ఆణిముత్యం పవార్ శిరీష సివిల్ పోలీస్‌లో రాష్ట్ర స్థాయిలో 17వ ర్యాంక్ సాధించింది. తండ్రి పవార్ శ్రావణ్ ఆర్టీసీ డ్రైవర్‌గా బాన్సువాడ డిపోలో విధులు నిర్వహిస్తున్నారు. పవర్ శ్రవణ్ దంపతులకు నలుగురు కూతుర్లు ఉన్నారు. డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూనే నలుగురు కూతుర్లను చదివిస్తూ రెండవ కూతురు డిగ్రీ చదువుతుండగా మూడవ కూతురు ఇంటర్మీడియట్ నాలుగోవ కూతురు పదో తరగతి చదువుతున్నారు. పవర్ శిరీష చదువులో పదవ తరగతిలో ఫస్ట్ క్లాస్ జీపీఏతో ఉత్తీర్ణులై ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంక్ సాధించారు. తన లక్ష్యం సివిల్ సాధించడమే అని శిరీష తెలిపారు. శిరీష ముందు చదువులో రాణించి ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, పవార్ శిరీష ఎస్సై సివిల్ పరీక్షల్లో ర్యాంక్ సాధించడం పట్ల స్థానికులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు, నాయకులు, ప్రజాప్రతినిధులు శిరీష ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను, శిరీషను అభినందించారు.

ఆరోగ్య శ్రీ పథకం వారోత్సవాలు



ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆరోగ్యశ్రీ వారోత్సవ వేడుకలు

నవతెలంగాణ-బోధన్‌టౌన్

పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆరోగ్య శ్రీ పథకం వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మహాజన నేత మందకృష్ణ మాదిగ 2004లో గుండె జబ్బులతో బాధపడుతున్న పసి పిల్లలతో హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై మహా ధర్నాను నిర్వహించారు. దీంతో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం దిగొచ్చి ప్రభుత్వం ఉచిత ఆపరేషన్ల కొరకు ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెడుతుందని చెప్పారని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జి లక్ష్మీగారి భూమయ్య, బోధన్ పట్టణ అధ్యక్షులు తాడేం అబ్బయ్య, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సోంపూర్ పోచిరాం, లింగ డోల బాలయ్య, ఎడ్ల ఈరయ్య, శంకర్, కనకయ్య నీలం తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న బ్యాంక్ అధికారులకు సన్మానం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో కోపరేటివ్ బ్యాంక్‌లో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న బ్యాంక్ అధికారులు అసిస్టెంట్ మేనేజర్ రవీందర్ భిక్కనూర్‌కు బదిలీ కాగా, క్లర్క్ పురాం రాకేష్ మాచారెడ్డి కోపరేటివ్ బ్యాంకుకు బదిలీ అయిన సందర్భంగా సొసైటీ, బ్యాంక్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రాజా గౌడ్, కో-ఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ రాజారెడ్డి, సొసైటీ సీఈఓ మోహన్ గౌడ్, బ్యాంక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

12వ రోజుకు ఎంపీటీసీ రిలే నిరాహారదీక్ష

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలంలోని అన్నసాగర్ ఎంపీటీసీ పరిధిలోని గ్రామాల రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అన్నసాగర్ ఎంపీటీసీ సభ్యురాలు ఉమాదేవి గురుప్రతాప్ చేపట్టిన రిలే నిరాహార దీక్ష సోమవారం 12వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ న్యాయపరమైన డిమాండ్లను వెంటనే ఎమ్మెల్యే నెరవేర్చాలని కోరారు. ఈ దీక్షలో అన్నసాగర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఎస్పీలో పలువురు చేరిక

నవతెలంగాణ-బోధన్‌టౌన్

పట్టణంలోని ఆచన్‌పల్లి బీఎస్పీ కార్యాలయంలో సోమవారం పలువురు చేరారు. ఈ సందర్భంగా వారికి బీఎస్పీ నియోజకవర్గ ఇంచార్జి సింగడి పాండు పార్టీలో చేరిన వారికి కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మహమ్మద్ అజార్, అబ్దుల్ షకీల్ పాల్గొన్నారు.



బీఎస్పీలో పలువురు చేరిక

తల్లిపాల వారోత్సవాలు

నవతెలంగాణ-కోటగిరి/రెంజల్

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం గర్భిణులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అంగన్వాడీ సూపర్వైజర్ మనీ మాట్లాడుతూ.. భవిష్యత్తులో బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే ముర్రపాలు తాగించాలని, తల్లిపాల విశిష్టత గురించి వివరించారు. సర్పంచ్ గడ్డం భారతి అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ సరిత మారుతి, అధికారులు డబ్ల్యూహెచ్‌వో గోవర్ధన్, అంగన్వాడీ సూపర్వైజర్ మనీ, ఏఎన్ఎం ప్రమీల, హెల్త్ సూపర్వైజర్ జ్యోతి, పల్లెవెలుగు డాక్టర్ పావని, అంగన్వాడీ టీచర్లు సాయమ్మ, విజయలక్ష్మి సునీత, ఆశావర్కర్లు రుక్మిణి, పంచశీల, అనిత తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని సాటాపూర్ గిరిజన తండాలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేసినట్టు ఐసీడీఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముర్రుపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమైనవని, పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలన్నారు. పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలనే కచ్చితంగా ఇవ్వాలని ఆమె సూచించారు. మూడు సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలు ప్రైవేట్ పాఠశాలలకు పంపవద్దని, అంగన్వాడీ కేంద్రంలో చేర్పిస్తే పిల్లలకు పౌష్టికాహారం అందుతుందన్నారు. ఒకటి నుంచి ఐదో తారీకులోపు పిల్లల బరువులను కొలిచి వారికి పౌష్టికాహారాన్ని అందించాలని ఆదేశించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పౌష్టికాహారంతో పాటు, అన్నప్రసన్న చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మహబూబ్ అలీ, అంగన్వాడీ టీచర్ సావిత్రి, ఆరోగ్య కార్యకర్త సరస్వతి, ఆశలు పద్మ వసంత, భాగ్యలక్ష్మి, తల్లులు లక్ష్మీ మీరాబాయి తదితరులు పాల్గొన్నారు.



కోటగిరి : కొత్తపల్లిలో తల్లిపాల వారోత్సవాలు

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-లింగంపేట్

సాధన సంస్థ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండలంలోని మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో సైబర్ నేరాలపై సోమవారం సాధన సంస్థ, పోలీస్ కళాబృందం వారి ఆధ్వర్యంలో అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సాధన సంస్థ, కైలాష్ సత్యర్థి చైల్డ్రెన్స్ ఫౌండేషన్ సహాయంతో చేపడుతున్న ఆక్సెస్ టు జస్టిస్ ఫర్ అల్ ప్రోగ్రాం గురించి కమ్యూనిటీ సోషల్ మోబిలైజర్ సతీష్ మాట్లాడుతూ.. అక్రమ రవాణాకు గురైన పిల్లలు, బాల్యవివాహాలు జరిగిన, పిల్లలు లైంగిక వేధింపులు గురైనా, బాల కార్మికులు, బాల్య వివాహాలు, చదువు మానేసిన పిల్లలు, తప్పిపోయిన పిల్లలు, ఇంటి నుంచి పారిపోయిన పిల్లలు కనపడితే సాధన సంస్థ ప్రతినిధులను సంప్రదించాలని వారు విద్యార్థులకు సూచించారు. అలాగే పోలీస్ కళాబృందం వారు పిల్లలకి సైబర్ నేరాల, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లో వచ్చే లింక్‌లు నుంచి ఎలా బయటపడాలో విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో కామారెడ్డి పోలీస్ కళాబృందం, సాధన సంస్థ కమ్యూనిటీ సోషల్ మోబిలైజర్ సతీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ బృందం

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

నవతెలంగాణ-మద్నూర్/సదాశివనగర్

మండలంలోని చిన్నఎక్లారా గ్రామంలో పశు సంవర్ధక శాఖ రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పశువులకు సోమవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భీమ్రావు, జేవీవో విజయ, నాగనాథ్, పరమేష్, హనుమంతు, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి బబ్బర్ పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డా.ఆర్.రమేష్, అడ్లూర్ ఎల్లారెడ్డి సర్పంచ్ పైడి జానకి, యం.పి.టి.సిలు లక్ష్మీ, రేణుక, సింగిల్ విండో కమిటీ చైర్మన్ మర్రి సదాశివరెడ్డి, విజయ డెయిరీ సూపర్‌వైజర్ శ్రీ.రమేష్, విజయ డెయిరీ అధ్యక్షులు డి.నర్సారెడ్డి, మాజీ అధ్యక్షులు సంకరి వెంకట్ రాములు, వార్డు మెంబర్ అశోక్, పశుగణ సహాయకులు డి.జుగల్ కిషోర్, సిబ్బంది ఇస్మాయిల్, సాయి కుమార్, గోపాల మిత్రులు మురళి, కాశిరెడ్డి, రాజేశ్వర్, పాడిరైతులు పైడి.చిన్నయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్, గంగయ్య, పెద్దమల్లయ్య, లింగారెడ్డి, శివారెడ్డి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



సదాశివనగర్‌లో గాలికుంటు నివారణ టీకాలు

చేనేత వస్త్ర తయారీకి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

నవతెలంగాణ-దోమకొండ

చేనేత దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా చేనేత పరిశ్రమకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, సర్పంచ్ అంజలి అన్నారు. మండల కేంద్రంలోని ఆనంద్ భవన్‌లో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జెండాను సోమవారం ఆవిష్కరించారు. దోమకొండ గడి కోట ట్రస్ట్ సహకారంతో దోమకొండ చేనేత సహకార సంఘం వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న చేనేత శిక్షణ, ఉత్పత్తి కేంద్రంలో చేనేత దినోత్సవాన్ని జరుపుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తీగల తిరుమల్‌గౌడ్, ఉప సర్పంచ్ గజవడా శ్రీకాంత్, చేనేత సంఘం అధ్యక్షుడు బొమ్మరి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్,జడ్పీటీసీలు

ప్రజల ఆరోగ్యానికి ఆసరా.. సీఎం రిలీఫ్ ఫండ్



చెక్కును అందజేస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-మద్నూర్

ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ప్రజల ఆరోగ్యానికి ఎంతో ఆసరాగా నిలుస్తుందని, ప్రజలు అనారోగ్యాల పాలై ఆసుపత్రుల్లో చికిత్సల నిమిత్తం ఖర్చులు పెట్టిన డబ్బులు సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా ఇప్పించనున్నటుట సర్పంచ్ సురేష్ తెలిపారు. గ్రామంలోని ఎల్లమ్మ గల్లీకి చెందిన లబ్దిదారునికి రూ.29,500 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును సోమవారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బస్సీ పటేల్, రైతు సమన్వయ సమితి కన్వీనర్ కంచిన్ హనుమాన్లు, సర్పంచ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మికి దరఖాస్తులు చేసుకోవాలి

- మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని గృహ లక్ష్మీ దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ మాట్లాడుతూ గృహ లక్ష్మీ అర్హులైన వారు ఈ నెల 8వ తేదీ నుంచి 10 వరకు ఆయా వార్డుల్లో ప్రత్యేక అధికారిని సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జీవన్, కౌన్సిలర్లు, కో అప్షన్ మెంబర్స్ పాల్గొన్నారు.

నేడు ఆరేపల్లిలో ఎమ్మెల్యే పర్యటన

నవతెలంగాణ-రాజంపేట్

మండలంలోని ఆరేపల్లి గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పలు అభివృద్ధి పనులు ప్రారంభించి గ్రామపంచాయతీ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించనున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బిక్యాజి బలవంతరావు సోమవారం పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన తెలిపారు.

లింగంపేట ఎస్సైని సన్మానించిన విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు

నవతెలంగాణ-లింగంపేట్

నూతనంగా వచ్చిన ఎస్సై ప్రభాకర్‌ను విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సోమవారం శాలువా కప్పి మర్యాదపూర్వకంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కమ్మరి పండరి, మాజీ ఎంపీపీ, మాజీ జిల్లా అధ్యక్షులు భీమయ్య, మాజీ జెడ్పీటీసీ తదితరులు పాల్గొన్నారు.

108 వాహనం ప్రారంభం

నవతెలంగాణ-రెంజల్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా విచ్చేసిన 108 వాహనాన్ని డాక్టర్ వినయ్ కుమార్ సోమవారం ప్రారంభించారు. మండల ప్రజలు ఈ అత్యవసర సేవలను వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఈఓ చింతల శ్రావణ్ కుమార్, సిబ్బంది ఏ.నాగరాజుగౌడ్, సంజీవ్‌గౌడ్, స్టాఫ్ నర్స్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులు పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-మద్నూర్

విద్యుత్ వినియోగదారులు సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని ఏడీఈ బిచ్కుంద రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9న మండలంలోని మేనూర్ గ్రామంలో గల సబ్‌స్టేషన్ కార్యాలయంలో పరిష్కార వేదిక నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని బిచ్కుంద, జుక్కల్, దోంగ్లి, మద్నూరు విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాలని సూచించారు.

నిధుల మంజూరు కోసం మంత్రులకు ఎమ్మెల్యే వినతి

నవతెలంగాణ-బోధన్

బోధన్ నియోజకవర్గంలో చేపట్టవలసిన అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరి చేయాలని కోరుతూ సోమవారం బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ సచివాలయంలో గిరిజన స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి కలిసి విన్నవించారు. దాంతో ఎమ్మెల్యే విన్నపానికి స్పందించిన మంత్రులు నిధుల మంజూరికి సానుకూలంగా స్పందించారు. గిరిజన, స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను కలిసి గిరిజన తండా గ్రామపంచాయతీల్లో రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పన కోసం 11 కోట్లను మంజూరు చేయాలని కోరారు. మార్కెటింగ్ శాఖ అధికారులతో పలు అభివృద్ధి పనులకు నిధుల వినియోగార్థం మంజూరికై విన్నవించారు. ఎమ్మెల్యే షకీల్ వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు దేశాయ్ ఉన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని కేమ్రాజ్‌కల్లాలీ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు విద్యాశాఖ సరఫరా చేసిన ఉచిత నోట్‌బుక్‌లను హెచ్ఎం జయచంద్ ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ నిర్మాణానికి భూమిపూజ



పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని తిప్పారం గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవనం నిర్మాణానికి సొసైటీ చైర్మెన్ సాయికుమార్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్‌తో కలసి స్థానిక సర్పంచ్ సాయిలు కొబ్బరికాయ కొట్టి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో తిప్పారం తండా సర్పంచ్ బిషన్ నాయక్, గొల్లడితండా సర్పంచ్ రవి, ఎంపీడీవో సతీష్ కుమార్, నాయకులు లక్ష్మణ్‌రావు, చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ ఎస్సైకి సన్మానం



నూతన ఎస్సైని సన్మానించిన్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-జుక్కల్

కొత్తగా ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణను మండలంలోని మహమ్మదాబాద్ బీఆర్ఎస్ నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై సత్యనారాయణ మాట్లాడుతూ.. మండలంలోని ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి శాంతి భద్రతలు కాపాడుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లక్ష్మెట్టి గంగాధర్, ఖండుగొండ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి బీసీ జాతీయ మహాసభలో నిజామాబాద్ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తిరుపతిలో సోమవారం జరిగిన అఖిల భారత బీసీ 8వ జాతీయ మహాసభలో నిజామాబాద్ బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్ ఆధ్వర్యంలో దాదాపు 50 మంది వెళ్లారు. తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో జరిగిన జాతీయ మహాసభలో దేశం నలుమూలల నుండి బీసీ నాయకులు పాల్గొనడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. సభలో పాల్గొన్న వారిలో నరాల సుధాకర్, మాడవేడి వినోద్ కుమార్, ధర్మనం దేవేందర్, కరిపె రవిందర్, కొయ్యాడ శంకర్, శ్రీలత, లక్ష్మీనారాయణ, శేఖర్, ప్రశాంత్, విజయ్, మహేష్, సంజీవ్ బాలన్న, రమణచారి, సదానంద్ , మురళి తదితరులు ఉన్నారు.

అనునిత్యం జనపక్షం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
4
మంగళవారం 08 ఆగస్టు 2023

చేనేత బంధు, పద్మశాలి బంధు ఇవ్వాలి

- మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు శ్రీపతి శేఖర్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

పద్మశాలీలందరికీ చేనేత బంధు, పద్మశాలీ బంధు ఇవ్వాలని పద్మశాలి సంఘం మండలం అధ్యక్షుడు శ్రీపతి శేఖర్ సోమవారం అన్నారు. మండల కేంద్రంలో చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికులను మండల పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో సన్మానించామని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీపతి శేఖర్ మాట్లాడుతూ.. చేనేత బంధు, పద్మశాలీబంధు కుటుంబానికి 10 లక్షలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం రూరల్ మాజీ అధ్యక్షులు లో లం జగదీష్, మండల యువజన సంఘం అధ్యక్షులు అంకం నరేష్ ,చేనేత జిల్లా ప్రధాన కార్యదర్శి కన్నెపల్లి ప్రసాద్, ఉపాధ్యక్షులు చిట్ల శ్యామ్, సత్యనారాయణ, శ్రీనివాస్ ,నవీన్, పద్మశాలి కుల పెద్దలు పాల్గొన్నారు.

గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ ఎజెండా

- రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూపతిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న భూపతిరెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ ఎజెండా తీసుకెళ్లేందుకే గడపగడపకూ కాంగ్రెస్, పల్లెపల్లెకూ భూపతిరెడ్డి కార్యక్రమం నిర్వహిస్తున్నామని రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూపతిరెడ్డి తెలిపారు. మండలంలోని గూపన్‌పల్లి, కేశ్‌పూర్‌లో మొదటిరోజు సోమవారం కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వారికి కాంగ్రెస్ పార్టీ ఎజెండాను వివరించారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముప్పగంగా రెడ్డి. అర్బన్ ఇంచార్జి తాహెర్‌బిన్ హందాన్, డిసిసి ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, అంతిరెడ్డి రాజిరెడ్డి, డిసిసి కార్యదర్శి ధర్మ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ డ్రైవర్లనుంచి రికవరీ చేసిన వేతనాలు చెల్లించండి

- కలెక్టరేట్ ఎదుట ధర్నా



మాట్లాడుతున్న మల్యాల గోవర్ధన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

మున్సిపల్ డ్రైవర్ల వేతనాల్లో రికవరీ చేయొద్దని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య డ్రైవర్ల సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య కార్మికులకు వెయ్యి రూపాయలు పెంచి చెల్లించి అనేక కారణాలు చెబుతూ మళ్లీ రికవరీ చేయడం అంటే కార్మికుల నోటికాడి కూడు ను గుంజుకోవడమేనని అన్నారు, డ్రైవర్ల నుండి కట్ చేసిన జీతాలను వెంటనే చెల్లించాలని, పెరిగిన వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డ్రైవర్స్ యూనియన్ నాయకులు చంద్రసింహ, లక్ష్మణ్, నరేష్, మారుతి, వినోద్, సత్యనారాయణ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.


చిత్రకళలో విద్యార్థికి సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

చిత్రకళ నైపుణ్యంలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థికి జడ్పీ చైర్మన్ దాదన్న గారి విట్టల్ రావు, బోధన్ ఎసిపి కిరణ్ కుమార్ వివా రాష్ట్ర అధ్యక్షులు గోపాలకృష్ణలు సన్మానించారు. పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సత్యనారాయణ కుమార్తె ధవళ సాయి బీటెక్ పూర్తి చేసింది. చిత్రకళ విభాగం నుండి విద్యార్థిని ప్రతిభ ను గుర్తించి జిల్లా కేంద్రంలో ఆదివారం సాయంత్రం జరిగిన విశ్వకర్మ ప్రతిభ పురస్కారాల కార్యక్రమంలో సన్మానించినట్టు జిల్లా డివిజన్ అధ్యక్షులు గోపాల కృష్ణ చార్య గద్దె గంగాధర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని పలువురు విశ్వకర్మ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై ఉద్యోగానికి ఎంపిక

నవతెలంగాణ-ఆర్మూర్



ఎంపికైన పూజ

మండలంలోని ఇస్సపల్లి గ్రామానికి చెందిన సట్లపల్లి పూజ ఎస్సై కొలువుకు ఎంపిక కావడంతో గ్రామస్తులు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన నడిపి ముత్తెన్న వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. తల్లి సాయమ్మ గృహిణి, వీరికి ఏకైక కుమార్తె పూజ. గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2014లో పదవ తరగతిలో ఉత్తమ జీపీఏ సాధించి బాసర ట్రిబుల్ ఐటీలో సీటు సాధించింది. ఆ తర్వాత హైదరాబాద్‌లోని టీసీఎస్ కంపెనీలు సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి ఎంపికైంది. పోలీస్ శాఖలో ఎస్సై నోటిఫికేషన్ రాగానే ఉద్యోగానికి రాజీనామా చేసి శిక్షణ తీసుకొని కష్టపడి చదివి తల్లిదండ్రుల కుటుంబ సభ్యుల కల నెరవేర్చింది. ఈ సందర్భంగా సర్పంచ్ దార్ల రాజు, రోటరీ క్లబ్ ఆఫ్ ఆదర్శ్ మాజీ అధ్యక్షులు కావేరి నర్సయ్య తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

సుప్రీంకోర్టు రాహుల్ గాంధీపై ఉన్న పార్లమెంట్ అనర్హత వేటును ఉపసంహరించుకోవాలని ఉత్తర్వులు జారీ చేయడంతో సోమవారం పార్లమెంటు స్పీకర్ రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని పునరుద్ధించిన సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కేశ వేణు ఆధ్వర్యంలో కాంగ్రెస్ భవన్ వద్ద టపాసులు కాల్చి మిఠాయిలు పంచి కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలోని ప్రజలందరినీ ఏకం చేస్తున్న రాహుల్ గాంధీ గొంతును నొక్కాలని , అనచివేయాలని పార్లమెంటులో ఆయన ఉండకూడదని చూసిన నరేంద్ర మోడీకి సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టులా ఉందని అన్నారు.

నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలోని ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తూ పాలన కొనసాగిస్తున్న సందర్భంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్యాన్ని బ్రతికించిందన్నారు. కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు తాహేర్ బిన్ హందాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి ,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అంతిరెడ్డి రాజారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు జావిద్ అక్రమ్, రోహిత్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు రాజ నరేందర్ గౌడ్, జిల్లా సేవాదల్ అధ్యక్షులు సంతోష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలలోనే సమృద్ధిగా పోషకాలు

- ఐఎంఏ ఆధ్వర్యంలో తల్లిపాలపై అవగాహన
- తల్లిపాల ప్రాముఖ్యతను ప్రపంచ దేశాలు గుర్తించాయి
- జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు

నవతెలంగాణ-కంఠేశ్వర్/కమ్మర్‌పల్లి/డిచ్‌పల్లి



ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తల్లిపాల దినోత్సవం



డిచ్‌పల్లి: సమావేశంలో మాట్లాడుతున్న విఠల్‌రావు

తల్లిపాల దినోత్సవం పురస్కరించుకుని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉమెన్ డాక్టర్స్ వింగ్ నిజామాబాద్ వారి ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ ఆస్పత్రిలో తల్లిపాల వలన ప్రయోజనాల గురించి గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం తల్లిపాల వలన ప్రయోజనాల అవగాహన కరపత్రాలను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉమెన్ డాక్టర్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షురాలు డా. కవిత రెడ్డి ముఖ్య అతిథిగా ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ ప్రతిమా రాజ్ హాజరై ఆవిష్కరించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ.. మామూలు పాలు తాగిన పిల్లల కంటే తల్లిపాలు తాగిన పిల్లలు చాలా తెలివిగలిగినవారై ఉంటారని తెలిపారు. అన్ని రకాల పోషకాలు తల్లిపాలలో సమృద్ధిగా వుంటాయని, తల్లిపాలు పిల్లలకు తొందరగా జీర్ణం అవుతాయిని అన్నారు. జబ్బుల కాపాడుతాయని అన్నారు. రొమ్ము, అండాశయ క్యాన్సర్ల నుండి రక్షిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉమెన్స్ వింగ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డా. భాండారి సుజాత, డా. ప్రియాంక, రాష్ట్ర సహాయ కార్యదర్శి డా. ఫరీద బేగం , సహాయ కార్యదర్శి డా. సాయి లక్ష్మి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డా. జలగం తిరుపతి రావ్ , డా. బాలెష్, పూర్నిమా, డా. దీపక్ గర్భిణి స్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: తల్లిపాలే బిడ్డకు అమృతమని ఎంఎల్‌హెచ్‌పి దుర్గాభవాని అన్నారు. మండలంలోని కొన సముందర్ గ్రామంలో భీంగల్ ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గర్భిణీలు, బాలింతలకు అంగన్వాడీ టీచర్లు తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడవ నెల నుండి తల్లిపాలు ఇస్తూ అనుబంధ పోషకాహారం పెట్టాలని సూచించారు. బిడ్డకు రెండు సంవత్సరాలు వచ్చే వరకు తల్లిపాలు ఇస్తుండాలని వివరించారు. గర్భం దాల్చిన నుండి ఆకుకూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు, మంచి పోషక పదార్థాలు తీసుకోవాలన్నారు. తద్వారా కడుపులోని బిడ్డకు బలంతో పాటు ఆరోగ్యం ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు లక్ష్మి, రమాదేవి, పుష్ప, నీరజ, ఆశా కార్యకర్తలు సుజాత, గర్భిణీలు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: తల్లిపాల ప్రాముఖ్యతను ప్రపంచ దేశాలు గుర్తించాయని ప్రతిఒక్కరూ ముర్రుపాలను అప్పుడే పుట్టిన చిన్నారికి ఖచ్చితంగా తాగించాలని నిజామాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ఎస్ఎల్ జి గార్డెన్లో సోమవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 120 దేశాలలో 1991 నుండి తల్లి పాల వారోత్సవాలు జరుగుతున్నాయని తెలిపారు. 50 మంది ఉద్యోగస్తులు పని చేస్తున్న ప్రతి సంస్థ పిల్లల సంరక్షణకు సౌకర్యం కల్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మహిళా కమిషన్ చైర్ పర్సన్ ఆకుల లలిత మాట్లాడుతూ ప్రతితల్లి కూడా పిల్లలకు పాలు తాగించాలని, దీంతో తల్లికి రొమ్ముక్యాన్సర్ గానీ గర్భసంచికి క్యాన్సర్ గానీ రాకుండా ఉంటుందన్నారు.. కార్యక్రమంలో మహిళా కమీషన్ సభ్యురాలు సుదాం లక్ష్మి, సీడీపీఓ స్వర్ణలత, రసూల్బీ, ఎంపీడీఓలు గోపిబాబు, లక్ష్మణ్, పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ దీపక్ రాథోడ్, మండల ఆరోగ్య విస్తీర్ణాధికారి వై. శంకర్, ఆరోగ్య పర్యవేక్షకులు పి.రాజేందర్, ఐకెపి ఎపియంలు అంగన్ వాడి పర్యవేక్షకులు, అంగన్వాటీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

జయశంకర్ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధంగా ఉండాలి

- సమూహ కరపత్రం ఆవిష్కరించిన తెరసం అధ్యక్షులు
- డాక్టర్ నాళేశ్వరం శంకరం

నవతెలంగాణ-కంఠేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నాళేశ్వరం

జయశంకర్ సార్ వలస పాలకుల వివక్షతో నానా ఇబ్బందులకు గురవుతున్న తెలంగాణ పేద ప్రజల పక్షాన నిలిచి జీవితమంతా పోరాటం సాగించాడని ఆయన అడుగుజాడలో నేటి సాహితీవేత్తలంతా కదిలి రావాలని తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నాళేశ్వరం శంకరం అన్నారు. ఆదివారం రాత్రి నిజామాబాద్ కేర్ డిగ్రీ కళాశాలలో జరిగిన డాక్టర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి ఉత్సవంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. అదే లక్ష్యంతో దేశంలోని కవులు, రచయితలు " సమూహ" అనే వేదికపై ఒక్క తాటిపైకి వచ్చి దేశంలో చెలరేగుతున్న హింస అత్యాచారాలపై, విద్వేషాలపై వాటిని ప్రోత్సహించే శక్తులపై కలం ఎక్కు పెట్టనున్నారని ఆయన వివరించారు. సంఘటిత పోరాటం, ప్రజా చైతన్యం విజయాలు సాధిస్తాయి అనడానికి తెలంగాణ ఉద్యమం ఒక ఉదాహరణ అని, "సమూహ" వేదిక ఈ దిశలో విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా "సమూహ ఆవిర్భావ సభ" కరపత్ర ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఘనపురం దేవేందర్ మాట్లాడుతూ.. తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ ప్రకటించిన ఉద్యమ స్ఫూర్తి తెలంగాణ సాధనలో కీలక పాత్ర వహించిందని, ఆయన ఆశయాల సాధనే బంగారు తెలంగాణ నిర్మాణమని అన్నారు. సమాజంలో విద్వేష శక్తులకు చోటు ఇవ్వరాదని, ప్రజలలో చైతన్యం తేవాల్సిన బాధ్యత కలం యోధులపై ఉన్నదని అన్నారు. కార్యక్రమంలో హరిప్రియ రమణ, ఎలగందుల శంకర్, రూపేశ్, ఆర్ మధు, దారం గంగాధర్, భారత్ జాగృతి సాహిత్య విభాగం కన్వీనర్ తిరుమల శ్రీనివాస్ ఆర్య, పంచ రెడ్డి లక్ష్మణ, హరిదా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసర్ల నరేశ్ రావు, బాగుల యాదగిరి, ఇందూరు యువత అధ్యక్షులు డాక్టర్ మద్దుకూరి సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు

పాలిచ్చే పశువులకూ టీకాలు వేయించండి

- మండల పశు వైద్య అధికారి లక్కం ప్రభాకర్

నవతెలంగాణ-ఆర్మూర్



లక్కం ప్రభాకర్ ఆధ్వర్యంలో గాలికుంటు టీకాలు

పాలు ఇచ్చే పశువులకు కూడా టీకాలు వేయించాలని, గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు ఇవ్వడం వల్ల చూలు పోదు అని మండల పశు వైద్య అధకారి లక్కం ప్రభాకర్ సోమవారం తెలిపారు. మండలంలో బర్రెలు, ఆవులకు ఉచితంగా గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నారు. మండలంలో మచ్చర్ల గ్రామంలో కార్యక్రమాన్ని ఎంపీపీ పస్కా నరసయ్య ఆవుకు మొదటి టీకా వేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంజి నర్సయ్య, ఉప సర్పంచ్ గంగారెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, అమృత రావు, గంగాధర్, ముత్యం, కుమ్మరి బుచ్చెన్న పాల్గొన్నారు. పశువైద్య సిబ్బందితో గ్రామంలో తిరుగుతూ.. అన్ని పశువులకు టీకాలు ఇప్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ... పాడి రైతులు అపోహలు వీడి, తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఇప్పించాలని కోరారు. మంగళవారం ఆలూరు మండల కేంద్రంలో దేగాం గ్రామాల్లో కూడా కొనసాగుతుందని తెలిపారు. పశువులను ఇంటివద్దే కట్టు మీద ఉంచాలని అన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రాధ, నాగార్జున, శ్రీనివాస్ గౌడ్, నర్సయ్య, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్



ఆర్థిక సహాయం అందజేస్తున్న సుచరిత రెడ్డి

మండలంలోని గోవింద్ పెట్ గ్రామానికి చెందిన హెూటల్ స్వప్న ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని, ఇటీవల వర్షాలకు ఇల్లు కూలిపోయే దశలో ఉంది అని తెలుసుకున్న రాకేష్ రెడ్డి ఫౌండేషన్ డైరెక్టర్ సుచరిత రెడ్డి సోమవారం 10వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. పిల్లల చదువుకు కూడా ఆర్థిక చేయూత ఇస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో గోవింద్ పెట్ ఎంపీటీసీ యేళ్ళ రాజు కుమార్, రమేశ్, సుభాష్, చంద్ర శేఖర్, శోభన్, మహేష్, జయకృష్ణ పాల్గొన్నారు.

క్రీడాకారునికి ఆర్థిక సహాయం అందజేత

పట్టణానికి చెందిన ఓర్సు మహేష్ అనే క్రీడాకారుడు ఇటీవల గోవాలో నిర్వహించిన అండర్ 17 రూరల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఇండియా నేషనల్ లెవెల్ గేమ్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. ఈనెల 25న నేపాల్ భూటాన్‌లో జరిగే ఇంటర్నేషనల్ గేమ్స్‌కు ఎంపికైంది. గేమ్స్‌లో పాల్గొనడానికి పైడి రాకేష్ రెడ్డి ఫౌండేషన్ తరపున అంకాపూర్ రాకేష్ రెడ్డి నివాసంలో ఫౌండేషన్ డైరెక్టర్ సుచరిత రెడ్డి శాలువాతో సన్మానించి, 10వేల రూపాయలు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో భూమేష్, సురేష్ రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు

పట్టణానికి చెందిన కాల రవి అనారోగ్యంతో మరణించగా రాకేష్ రెడ్డి ఫౌండేషన్ డైరెక్టర్ సుచరిత రెడ్డి వారి ఇంటికి వెళ్లి 10రూపాయలు ఆర్థిక సహాయం చేశారు.

నాసిరకం పనులతో రోడ్డు ధ్వంసం

- మల్లికార్జున్ రెడ్డి

నవతెలంగాణ-వేల్పూర్



ధ్వంసంమైన రోడ్డును పరిశీలిస్తున్న ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి

మండలంలోని పచ్చలనడుకుడ నుండి మోతె బైపాస్ రోడ్డును నాసిరకంగా వేయడంతో పూర్తిగా ధ్వంసమైందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి అన్నారు. బైపాస్ రోడ్డును సోమవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. 20 రోజుల కిందట ఈ బైపాస్ రోడ్డును రిపేర్ చేశారన్నారు. నాసిరకంగా రిపేర్ చేయడంతో ధ్వంసమైందన్నారు. ఈ బైపాస్ రోడ్డును కూడా మంత్రి ప్రశాంత్ రెడ్డి తన బంధువులకు కాంట్రాక్ట్ ఇవ్వడంతో కమీషన్లకు కక్కుర్తిపడి నాసిరకంగా నిర్మించారని మండిపడ్డారు. నియోజకవర్గంలో చాలా చోట్ల పాత రోడ్లకు నల్ల రంగు వేసి ఇదే కొత్త రోడ్డు అని మంత్రి ప్రశాంత్ రెడ్డి ప్రజలను మోసంచేస్తున్నాడని ఎద్దేవా చేశారు. స్థానిక గ్రామస్థులు అధికారులను, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను ఈ రోడ్ల గురించి అడిగితే ఆ రోడ్లపై భారీ వాహనాలు వెళ్లొద్దు అంటున్నారని తెలిపారు. డాంబర్ రోడ్లపై భారీ వాహనాలు గాక సైకిళ్ళు వెళ్తాయా అని ప్రశ్నించారు. రోడ్ల నిర్మాణం పూర్తయిన వెంటనే అధికారులు క్వాలిటీ కంట్రోల్ టీంతో చెకింగ్ చేయించాలని డిమాండ్ చేశారు. పాత రోడ్లన్నీ బాగున్నాయని, కానీ కొత్తగా వేసిన రోడ్లు మాత్రమే ఎందుకు ధ్వంసమవుతున్నాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మల శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ మల్కాన్నగారి మోహన్, మండల అధ్యక్షులు ఏలేటి రమేష్ రెడ్డి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు పోతుల బాలకిషన్, మాజీ ఎంపీటీసీ వల్లం రవి, నాయకులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్

నవతెలంగాణ-ఆర్మూర్



తసిల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

అధిక వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం తక్షణం ఎకరాకు రూ. 20 వేల ఇచ్చి ఆదుకోవాలని సోమవారం డిప్యూటీ తసిల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. జిల్లాలో కురిసిన అధిక వర్షాలకు మండలంలో దాదాపు 2వేల ఎకరాల్లో పంటలు నీటమునిగాయని, కొన్ని చోట్ల ఇసుక మేటలు పడ్డాయని అన్నారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ.. అధిక వర్షాలకు, వరదలకు జిల్లా వ్యాప్తంగా 70 వేల ఎకరాల్లో పంటలు మునిగిపోయాయని ప్రభుత్వం యుద్ధ ప్రతిపాదికన జరిగిన నష్టాన్ని అంచనా వేసి నష్టపోయిన పంటలకు ఆహార ధాన్యాలు ఎకరాకు 10 వేల రూపాయలు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.2వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అధిక వర్షాలు, వరదల వలన పత్తి, వరి, మొక్కజొన్న, కూరగాయలు, సోయా, వేరుశనగ, కంది, పెసర, పంటలు మునిగి పోయాయని అన్నారు. రాష్ట్రంలో పంటల బీమా లేకపోవడం వల్ల రైతులకు భరోసా లభించడం. లేదని అన్నారు. తక్షణం వ్యవసాయాధికారులు, రెవెన్యూ అధికారులు జరిగిన నష్టాలపై అంచనా వేసి కేంద్ర బృందాన్ని పిలవాలని అన్నారు. ప్రకృతి వైపరిత్యాల వల్ల జరిగిన నష్టాలకు పరిహారం చెల్లించడానికి 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకోవాలని అన్నారు. ప్రభుత్వం జరిగిన నష్టంపై స్పందించకపోతే పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. గోవింద్ పెట్ గ్రామంలో శీలం గంగాధర రైతు పొలంలో ఇసుక దిబ్బలు ఏర్పడి పంట అంతా నష్టం పోయిందని, నాలుగు ఎకరాల్లో నాటు వేసినప్పటికీ ఎకరానికి 20వేల చొప్పున ఖర్చయిందని రైతు ఆవేదన వక్తం చేశారన్నారు. వర్షానికి తెగిపోయిన కాలువలు చెరువులను పునరుద్ధరించి రోడ్లు వేయాలని అన్నారు. యాసంగి సీజన్లో అకాల వర్షాల వల్ల రోడ్లపై ఉన్న వడ్లు కొట్టుకుపోయి మొలకలు వచ్చాయని ప్రభుత్వ నష్టపరిహారమేం చెల్లించలేదని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు భూమన్న గణేష్,రాజు, ఎల్లయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

- మండల పశు వైద్యాధికారి రాజశేఖర్ రావు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/ఏర్గట్ల



కమ్మర్‌పల్లి : పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

పశువులకు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి ఎ. రాజశేఖర్ రావు పశువుల యజమానులకు సూచించారు. మండలంలోని నాగాపూర్ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు నివారణ టీకాల శిబిరాన్ని నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు దుబ్బాక సుప్రియ ముఖ్యఅతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. గాలికుంటు వ్యాధి వలన పశువుల నోట్లో, గిట్టల్లో పుండ్లయి పశువులు బలహీన పడతాయన్నారు. తద్వారా పాల ఉత్పత్తి తగ్గి పాడి రైతులు ఆర్థికంగా నష్టపోతారని తెలిపారు. గ్రామంలోని 132 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ ప్రవీణ్ రెడ్డి, కార్యాలయ అసిస్టెంట్ స్వప్న, గోపాలమిత్ర స్వరన్, ఓఎస్ జమీల్, పశు మిత్రలు లక్ష్మి, స్వప్న పాల్గొన్నారు

ఏర్గట్ల: మండలకేంద్రంలో గల పశువులకు గాలికుంటు,నట్టల నివారణ మందులను పశు వైద్యాధికారి రాజ్యలక్ష్మి గేదెలకు,ఆవులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపేందర్ రెడ్డి,జడ్పీటీసి గుల్లే రాజేశ్వర్, ఎంపీటీసీ జక్కని మధు సూఎన్, వీడీసి ఛైర్మన్ కొలిప్యాక రవి, పశువైద్య సిబ్బంది గంగాధర్, మధుకర్, ప్రభాకర్,ప్రభాస్ పాల్గొన్నారు.

నిజామాబాద్ ఆర్డీవో రాజేందర్ కుమార్‌కు సన్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ ఆర్డీవో గా బాధ్యతలు స్వీకరించిన రాజేందర్ కుమార్ ఇందల్ వాయి ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్ బాధవత్ రమేష్ నాయక్ మార్యద పుర్వకంగా సోమవారం కార్యాలయంలో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు హన్మంత్ రెడ్డి, ఎంపీటీసీ స్వామి తదితరులు ఉన్నారు.

పంట నష్టం నమోదు

నవతెలంగాణ-వేల్పూర్

మండలంలో వ్యవసాయ అధికారులు పంట నష్టం నమోదు చేశారు. కాడి చెరువు, మైనర్ కుంట , మరుసు కుంట చెరువుల కింద ఉన్న పొలాలను పరిశీలించి నివేదిక ప్రభుత్వానికి అందచేస్తామని తెలిపారు. సహాయ వ్యవసాయ అధికారి నీఖిల్, ఉప సర్పంచ్ పిట్ల సత్యం ,జిల్లా ఆర్‌టీఏ మెంబర్ రెగుల్ల రాములు, యంపిటిసి మొండి మహేష్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బబ్బూరు ప్రతాప్, మెతరి కార్తిక్, రైతులు పాల్గొన్నారు.